
## వుయ్యూరు వెంకటరావు



# నువ్వేనా నువ్వేనా?

మైడియర్ జయప్రకాష్,

నువ్వు నన్ను చూడటానికి నాలుగు వందల మైళ్లు ప్రయాణంచేసి వస్తున్నా వంటే నేనెంత పొంగిపోయాను? రెండు సంవత్సరాల అనంతరం మళ్ళీ ఒకర్ని ఒకరం కలుసుకోబోతున్నామన్న తలంపు నన్ను ఆనందంలో ముంచి వేసింది. ఆరోజు నీ వుత్తరం చూసి ఎంతమందికి గర్వంగా చెప్పానో తెలుసా?

"ఏమిటీ వీడికింత గర్వం?" అను కున్నారు ఇక్కడి నా సహచరులు. హుఁ వాళ్ళకేంతెలుసు, నీలాంటి ఉన్నత మైన వ్యక్తి స్నేహాన్ని పొందినందుకు ఎంతగా గర్వించాలో కూడా తెలియని మూర్ఖులు. 'వూరికే నాలుగు లల్లాయి కబుర్లు చెప్పుకుంటూ, గలగల శబ్దం చేస్తూ వాగటం తప్ప, భావం ఇసుమం తైనా స్ఫురింపజేయలేనివాళ్ళకు, కాలపు విలువా, స్నేహపువిలువా ఎలా తెలు

స్థాయి' అని నాలో నేను అనుకున్నాను. నువ్వెంత తక్కువ మాట్లాడేవాడివి! మాట్లాడిన తక్కువలోనే ఎన్నెన్ని భావాలు స్ఫురించేవి. భావగాంభీర్యం వుండాలిగాని, వూరికేమాటలతో పెద్దగా శబ్దం చేసి ప్రయోజనంలేదు అన్నది నేను మొదటిసారిగా నీదగ్గరే నేర్చు కొన్నాను.

మనం మద్రాసులో చదివే రోజులు జ్ఞాపకంవున్నాయా? ఆ రోజుల్లో నేనెలా వుండేవాడినో తలచుకొంటే ఎంతో సిగ్గ వేస్తోంది. దేన్నిగురించీ నిశ్చితమైన అభిప్రాయం లేకుండా ఎటు గాలివీస్తే అటు వంగే గడ్డిపోచలా, కొద్దిగాలికే అల్లాడి పోతున్న చిగురుటాకులా వుండేవాడిని. చిన్నవిషయాన్ని గురించి కూడా సరిగా వివరించలేక, లొడ లొడ మాట్లాడే వాగుడుకాయను నేను. వ్యక్తిత్వంలేని మనిషిని నేను

జీవితపు విలువల్ని అర్థం చేసుకున్న వారిలో అట్టడుగున వున్న నాతో, సర్వస్వాన్ని ఆకళింపు చేసుకున్న నీవు, నీ వున్నతిని కూడా మరచి ఎంత స్నేహభావంతో మసిలేవాడివో తలచుకుంటే నా మనసు ఇప్పటికీ ఆర్ద్రమౌతుంది. నన్నొక మనిషిగా తయారుచేశావు.

"వ్యక్తిత్వంలేని మనిషి ప్రవాహంలో కొట్టుకుపోయే గడ్డిపోచలాంటివాడు. ప్రవాహం ఎటుసాగితే, ఒక గమ్యం లేకుండా అదికూడా అటువైపు పోతుంది వ్యక్తిత్వం అన్ని హంగులున్న నౌక లాంటిది. మనం గమ్యం ఏదో ఖచ్చితంగా నిర్ణయించుకొని, అటువైపు సునాయాసంగా ప్రయాణం చెయ్యొచ్చు. విషయాల పట్ల స్పష్టమైన అభిప్రాయాలు ఏర్పరచుకోవాలి. ఎప్పుడూ మాట్లాడేది తక్కువగా వుండి ఆలోచన ఎక్కువగా వుండాలి. లొడ లొడ వాగి ఎందుకు పలచనైపోతావు? గంభీరంగా వుండలేవూ?" అని నువ్వు చెప్పినదాంట్లో ఎంత నిజముంది? నిజం. గలగల పారే సెలయేరుకన్నా శాంతంగాసాగే నదికే నిండుదనం ఎక్కువ. ఎప్పుడూ హడావిడిగా, గందరగోళంగా మాట్లాడుతుంటే నాకన్నా మితభాషిగా గంభీరంగా వుండే నువ్వే ఎన్నో విషయాలు విపులీకరించినట్లుండేది

యు ఆర్ మై ఫ్రెండ్, ఫిలాసఫర్ అండ్ గైడ్ చదువుపూర్తయి వుద్యోగం లేని ఈ రెండు సంవత్సరాలూ నువ్వు నేర్పిన పాఠాలు ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించాను. కొంతవరకు కృతకృత్యుణ్ణయ్యాను ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే గతం ఎంత పేలవంగా కనిపిస్తుందో తెలుసా? 'ఇలా ప్రవర్తించింది మాట్లాడిందీ నేనేనా' అని నామీద నాకే అసహ్యం వేసింది.

నీలాంటి వున్నతవ్యక్తిని ఇక్కడి వాళ్ళకు చూపాలన్న నా ఆశయం ఇన్నాళ్ళకు నెరవేరుతున్నది. నాలోని

మార్పుని చూసి నువ్వెంత సంతోషి స్తావో తలచుకొంటే నాకే గర్వంవేసింది.

కానీ... నువ్వువచ్చావు.

"నీతో గడిపిన పదిరోజులూ, ప్రతి క్షణమూ చిత్రమైన అయోమయంలో పడవేశాయి. అసలు నువ్వు నువ్వా? కాదా అన్న అనుమానం వచ్చింది.

ఎత్తయిన 'డాం' మీదనుంచి శర వేగంతో క్రిందికిదూకే నీటిని చూసి ముప్ఫయి సంవత్సరాల నువ్వు, చిన్న పిల్లాడిలా కేరింతాలు కొడుతూంటే నేను వెఱ్ఱిగా అలానే చూస్తూండిపోయాను.

రిజర్వాయరును గురించి నువు చేసిన కామెంటు నన్ను బాగా గాయపరచిందన్న విషయం బహుశా నీకు అర్థమయి వుండదు. 'అసలు నాగార్జునసాగర్ ఎందు కొచ్చామా?' అనిపించింది.

"రావ్; చూడు నివురుగప్పిన నిప్పులా ఆ నీళ్ళు స్తబ్దుగా ఎంత భయం కరంగా వున్నాయో? ఆ నీటిలో ఎన్ని భయంకర జంతు జాలాలున్నాయో?" అన్నావు.

పిచ్చివాడిలా నీ వంక చూశాను. తొందరపాటును అసహ్యించుకొని, శాంతాన్ని అనుసరిస్తూ గుంభనంగావుండే నువ్వేనా ఇలా మాట్లాడింది?

నాకంటే జూనియర్లయిన నా సహచ రుల్ని నీకు ఇంట్రడ్యూస్ చేశాను. వాళ్ళకి గిన సిల్లీవిషయాల్ని కూడా ఎంత ఇంట్రస్ట్ తీసుకొని జవాబులు చెప్పావు! ఆ రోజు నువ్వెంత మాట్లాడావో తెలుసా? నేను పూర్వాశ్రమంలో మాట్లాడిన దానికంటే ఎక్కువ మాట్లాడావు.

నువ్వంత మాట్లాడతావని నేనెప్పుడూ వూహించలేదు సచె గార్రులెస్‌నెస్!

నేను చెప్పిన నీ మితభాషిత్వాన్ని గంభీరాన్ని, వాళ్ళెంత అభిమానిస్తారో తెలిసుంటే నువ్వు వాళ్ళతో అలా కేరిం తాలు కొట్టుండవు. నీ వాక్ప్రవాహాన్ని ఆపుదామని నేను ప్రయత్నిస్తే 'వుండు రావ్ కొద్దిగా మాట్లాడనివ్వు' అన్నావు.

పర్వతశిఖరం లాంటినువ్వు శుష్క వాదులతో సహావాదనకు దిగుతావని ఎవరం అనుకోలేదు, వాళ్ళెంత నిరు త్సాహపడ్డారో తెలుసా?

"ఇన్నాళ్ళకు వ్యక్తిత్వం కల్గిన నిండు మనిషిని చూడబోతున్నా మనుకొన్నాం. కాని నిరాశే ఎదురైంది. నువ్వెందుకు అన్ని గొప్పలు చెప్పావు రావ్? అసలు పూర్తి వ్యక్తిత్వం కల్గిన మనుష్యులు ఎవరూ వుండరు" అన్నారు వాళ్ళు.

నేనెంత వేదన అనుభవించానో ఆ భగవంతుడికి తెలుసు. నా మనస్సు నిశ్శ బ్దంగా ఎన్నిరోజులు విలపించిందో నాకు తెలుసు.

ఐ వజ్ థరోలీ అన్‌శాటిస్‌ఫైడ్ విత్ యువర్ బిహేవియర్. నీతో గడి పిన పదిరోజులూ ఎంతో ఆనందంగా, నిండుగా వుంటాయనుకున్నాను. ఆ అను భూతి కోసం ఎంతో ఆత్రంగా ఎదురు

చూశాను. కాని ఆ అనుభూతి ఇంత వెలితిగా పేలవంగా వుంటుందని అనుకో లేదు.

ఎందుకిలా చేశావు జయప్రకాష్ ? ఎందుకా బిట్రేయల్ ? నువ్వు చెప్పిన దానికి పూర్తి వ్యతిరేకంగా నువ్వే నడుస్తూ ఒక శుష్కరాజకీయవాది లెవెల్ కి ఎందుకు దిగజారావు ?

నీ రావ్.

వుత్తరం వ్రాయటం ముగించి ఒక్కసారి నిట్టూర్చాను. వుత్తరం చాలా పెద్దదైంది. టైం చూశాను. తొమ్మిది గంటలైంది. ఉదయం ఎంత అందంగా ఉన్నా అది నా మనస్సును ఆహ్లాదపరచలేక పోయింది. ఎందుకో నా మనస్సు చికాకుగా ఉంది బోయ్‌ని కేకేసి కాఫీతెమ్మని చెప్పి, ఉత్తరం కవర్లోపెట్టి, స్టాంపులు అతికించటం మొదలుపెట్టాను.

"పోస్ట్" అన్న కేకవిని తలెత్తాను.

వెళ్ళి అందుకున్నాను. టైం మాగజీన్ కాక రెండు వుత్తరాలు వున్నాయి. ఒకటి నిర్మల దగ్గర్నుంచి; తీయని తలపు మనసులో కదిలింది. రెండో వుత్తరం, ఆశ్చర్యం! జె. పి రాశాడు! ఏం రాశాడో ? రెండేళ్ళతర్వాత నన్ను కలిసి, పదిరోజులు నాతో గడిపివెళ్ళాక అతను, నాకువ్రాసిన మొదటి వుత్తరం ఆతృతగా చించాను.

'మైడియర్ ఫిలాసఫర్,'

నాకు మరచిపోలేని కంపెనీ ఇచ్చి పదిరోజులు నాతోగడిపినందుకు థాంక్స్. కానీ నీలో ఒకమార్పు నాకు కనిపించింది. ఎప్పుడూ సరదాగా గలగల మాట్లాడుతూ అమాయకంగా ఉండే నీవు ఎందుకిలా సీరియస్‌గా మారిపోయావు ? సరదాగా గడపాలని నేనెంతో ఆశతో వచ్చాను. కాని నువ్వు సడెన్‌గా మూగపోయావు. ఎందుకా సీరియస్‌నెస్? వాటీజ్ రాంగ్ విత్ యు ? ఏవైనా సమస్యలా ?

'డోంట్ టేక్ ఎవ్విరి లిటిల్ థింగ్ ఈజ్ సీరియస్' అంటూవుండే నువ్వు ఇలా మారావెందుకు ? ఐ లైక్ యువర్ ఇన్నోసెన్స్. అందుకే నేనూ నీలా, మారాను. జీవితం ఇప్పుడు ఎంత చైతన్యవంతంగా వుందో తెలుసా ?

'ఇటీజ్ బ్లిస్ టు బి ఇన్నోసెంట్. నువ్వు ఇదివరకులా సరదాగా, అల్లరిగా వుండాలి, గలగలా మాట్లాడాలి. దట్స్ మై విష్.

యువర్స్
జె. పి'

చదవటం పూర్తయింది. అలాగే చూస్తూ వుండిపోయాను. ఏమిటిది ?

'కాఫీసార్' అన్న బాయ్ కేకతో ఈ లోకానికి వచ్చిపడ్డాను.

"అయ్యా వుత్తరం పోస్ట్‌చేసి రమ్మంటారా?'' అన్న బోయ్‌ప్రశ్న నాలో సంచలనాన్ని రేపింది. ఆ వుత్తరం పోస్ట్‌చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో పడ్డాను.

———